ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 296 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 4 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



# లోక్‌సభలో గందరగోళం

8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్

చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం

చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ

మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ చైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు.

"ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన ..మిగతా 2లో

# పీఎం ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

సుస్థిర ప్రగతికి దోహద పడేలా బడ్జెట్ ఉందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపాటు

3 హైస్పీడ్ రైల్ కారిడార్లు రాబోతున్నాయని వెల్లడి


హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బడ్జెట్ సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.

పీఎంఏవై కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు : ప్రతి జిల్లాకు బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు.



ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని వివరించారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని ..మిగతా 2లో



# మున్సిపల్ ఎన్నికల్లో ముగిసిన కీలక ఘట్టం

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. మంగళవారం సాయంత్రం 3 గంటల వరకూ ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కడైనా రీపోలింగ్ నిర్వహించాల్సివస్తే ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక, 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉండనుంది. మెత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈసీ అధికారులు తెలిపారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ..మిగతా 2లో



# అసంతృప్త నేతలను బుజ్జగించండి

మంత్రుల భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

పాత, కొత్త నేతల సమన్వయంతో పనిచేయాలన్న సీఎం

మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని ఆదేశాలు

మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల రాజకీయ పరిణామాలపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో తాజాగా భేటీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మంత్రులందరు తమ బాధ్యతలున్న జిల్లాలకు వెళ్లాలని ఆదేశించారు. సర్వేల్లో వెనుకబడిన మున్సిపాలిటీలపై విశ్లేషణ చేశారు. జిల్లా పర్యటన వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం ఎప్పటికప్పుడు ఇన్‌ఛార్జ్ మంత్రులతో భేటీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

పాత, కొత్త నేతలను సంప్రదించండి : రోజువారీగా నివేదిక అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆశపడి భంగపడ్డ ..మిగతా 2లో




# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు క్లారిటీ

కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు మార్గం సుగమం

2

# దేశ గోప్యతను అడ్డుకోలేరు



వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ

ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ..మిగతా 2లో

# సహనమే గెలిపించింది



అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఎన్డీఏ సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ

ఒప్పందం కుదరడంతో ప్రధాని మోదీని సత్కరించిన కేంద్రమంత్రులు, ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ఈ శతాబ్దపు అతి పెద్ద ఈవెంట్‌గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఆ ఒప్పందం ప్రపంచ వేదికపై భారత్‌కు పెరుగుతున్న ప్రభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ..మిగతా 2లో

# లోక్‌సభలో గందరగోళం




మొదటి పేజీ తరువాయి...

పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు.

తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# పీఎం ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

"సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. బడ్జెట్ అంటే ఉచితాలు ప్రవేశపెట్టడమే అనే విధంగా ఆలోచిస్తున్నారు. కానీ ఈ ఏడాది బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా దేశంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం, బావితరాల భవిష్యత్ కోసం, 2047లో భారతదేశం ఒక అభివృద్ధి చేసిన దేశంగా పరివర్తన చెందేందుకు వేస్తున్న మరో అడుగు ఈ సంవత్సరం బడ్జెట్. హైదరాబాద్‌కు రైల్వే ఉండటం వల్ల పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి"- కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి

హైదరాబాద్ రైల్వే హబ్ మారబోతోంది : కాజీపేట రైలు మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు 70 శాతం పూర్తయ్యాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. కొమురవెల్లి, జోగులాంబ స్టేషన్లను త్వరలోనే ప్రారంభించబోతున్నట్లుగా చెప్పారు. ఇప్పటికే 5 వందే భారత్, రెండు అమృత్ భారత్ రైళ్లను కేంద్రం తెలంగాణకు ఇచ్చిందన్నారు. కవచ్ సాంకేతికత ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆ పనులు రాష్ట్రంలో వేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలోనే కవచ్ పనులు పూర్తిచేసుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. రైల్వే హబ్‌గా కూడా హైదరాబాద్ కాబోతుందన్నారు.

గ్రామీణ, పట్టణ సంస్థలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లుగా కిషన్ రెడ్డి వివరించారు. ఐటీ, డిజిటల్, హైస్పీడ్ రైలు కారిడార్ లాంటి పలు అంశాలకు పెద్దపీట వేయడం జరిగిందని కిషన్ రెడ్డి వివరించారు. 23 లక్షల ఎమ్ఎస్ఎమ్ఈలు తెలంగాణలో ఉన్నాయన్న ఆయన ఈ బడ్జెట్ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. గ్లోబల్ బయో ఫార్మాహబ్‌గా హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ కోసం హైదరాబాద్‌కు నిధులు కేటాయిస్తామని వివరించారు. కర్ణాటక తర్వాత తెలంగాణ ఐటీ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్న ఆయన ఈ రంగంలో పన్నులు తీసుకురావడం ఎంతో మేలన్నారు.

కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి విమర్శలు : పార్లమెంటులో ఒక్క ఎంపీ ఉన్న కమ్యునిస్టులు మోదీని గద్దెదించుతారా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ముందు కమ్యూనిస్టుల పార్టీలు కనుమరుగు కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. ఎస్ఐఆర్ దేశం అభివృద్ధి కోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అర్థం కాకపోతే ఏం చేస్తామని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్ల సింగరేణి భ్రష్టు పట్టిందన్నారు. సింగరేణిని కేసీఆర్ ప్రైవేటు కంపెనీగా మార్చుకున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేటు లిమిటెడ్‌గా మార్చుకుందన్నారు.

# అసంతృప్త నేతలను బుజ్జగించండి

మొదటి పేజీ తరువాయి...

అసంతృప్త నేతలను బుజ్జగించాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మంత్రులకు సీఎం పలు సూచనలు చేశారు. సమష్టిగా అందరు పనిచేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని చెప్పిన రేవంత్ కచ్చితంగా అన్ని స్థానాలు గెలవాల్సిందేనని గట్టిగా చెప్పారు. పాత, కొత్త నేతల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజకీయ పరిణామాలపై చర్చ : గెలుపు బాధ్యత పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌దేనని, ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఇన్‌ఛార్జ్ స్థానాల్లోనే ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమస్యలుంటే పీసీసీ చీఫ్, వార్‌రూమ్ దృష్టికి తేవాలని చెప్పారు. రెండు గంటలపాటు మంత్రులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి కీలకంగా పలు విషయాలు మాట్లాడారు. మంత్రులతో పార్లమెంటు నియోజకవర్గాలవారీగా సీఎం సమీక్షించారు. నాయకులు సమన్వయంతో ముందుకెళ్లాలని, కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం వస్తుందని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జులంతా వారంపాటు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. మున్సిపాలిటీలవారీగా రాజకీయ పరిణామాలు తెలుసుకోవాలని అన్నారు. ఈ భేటీలో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ మహేశ్‌కుమార్ గౌడ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈరోజుతో నామినేషన్ల ఉపసంహరణ




ప్రక్రియతో పాటు బీ-ఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరపున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్‌లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజులపాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది. మంత్రుల భేటీతో ప్రాధాన్యత : అందులో భాగంగా ఇవాళ పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మం తులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు చర్చించారు. పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా పరిస్థితులపై చర్చ ముగిసిన తరువాత ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా డీసీసీ అధ్యక్షుల నుంచి పీసీసీ నివేదికలు తెప్పించుకుంది. ఆ నివేదికల ఆధారంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి. రేపు నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగనుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ఆయన శంకుస్థాపన చేస్తారు. మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేసిన అనంతరం మున్సిపల్ ఎన్నికల కోసం బహిరంగ సభలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



# దేశ గోప్యతను అడ్డుకోలేరు

మొదటి పేజీ తరువాయి...

ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.




# మున్సిపల్ ఎన్నికల్లో ముగిసిన కీలక ఘట్టం

మొదటి పేజీ తరువాయి...

సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత కల్పిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారులకు సహకరించాలని పార్టీలను కోరారు. కాగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. పట్టణ ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు క్లారిటీ

## కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు మార్గం సుగమం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల అంశం గత కొంతకాలంగా రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా

తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చుని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది.

2024 ఆగస్టు 16న కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని నెలల తర్వాత వీరిని పదవుల నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి దాదాపుగా తొలగినట్టే రాజకీయ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

# సహనమే గెలిపించింది

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రసంగిస్తూ ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. 'భారత్ ఇప్పుడు ప్రపంచ వ్యవహారాల్లో కీలక శక్తిగా ఎదుగుతోంది. గ్లోబల్ సమతుల్యతను కాపాడడంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుం టోంది. భారత్ ప్రపంచ వేదికపై నిర్ణయాత్మక శక్తిగా ఎదగడం ఈ శతాబ్దపు అతిపెద్ద ఈవెంట్. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రజలు మమ్మల్ని విమర్శించారు. అయినా సహనంతో ఉన్నాం. అదే ఇప్పుడు గెలిపించింది. ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించింది. వాణిజ్య చర్చల పట్ల ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనం. ఇది భారత ఎగుమతులు, పెట్టుబడులు, పరిశ్రమలకు కొత్త అవకాశాలు తెస్తుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

రాబోయే 25 ఏళ్ల దృష్టితో బడ్జెట్ 2026 రూపొందించాం : ప్రధాని మోదీ

కేంద్ర బడ్జెట్ 2026ను రాబోయే 25 సంవత్సరాల దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ ఉద్దేశాలు, దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని ఎన్‌డీఏ ఎంపీలకు ప్రధాని సూచించారు. బడ్జెట్‌లోని ప్రాధాన్యాంశాలను సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం ఎంపీల బాధ్యత అని ఆయన అన్నారు.

'దేశవ్యాప్తంగా ఎన్‌డీఏ బలపడుతోంది'

దేశవ్యాప్తంగా అనేక చిన్న పార్టీలూ ఎన్‌డీఏతో చేతులు కలుపుతున్నాయని ప్రధాని చెప్పారు. ఇప్పుడు ఎన్‌డీఏతో కలిసిన పార్టీల సంఖ్య 50 శాతానికి మించిపోయిందని అన్నారు. ఇది దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడా ఎన్‌డీఏ రాజకీయ దృక్పథానికి పెరుగుతున్న ఆదరణను చూపిస్తోందని పేర్కొన్నారు.

ఇటీవలే భారత్ తొమ్మిది వాణిజ్య ఒప్పందాలు పూర్తి చేసిందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రధాని నాయకత్వంలో చారిత్రక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని అన్నారు. 39 అభివృద్ధి చెందిన దేశాలతో ఎఫ్‌టీఏలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇది దేశానికి చారిత్రక ఘట్టమని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలకు భారత్ కు ప్రాధాన్యం ఇస్తున్నాయన్న చెప్పడానికి అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం ఒక ఉదాహరణ అని తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ తమపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు.అంతకుముందు భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో ప్రధాని నరేంద్ర మోదీని కేంద్రమంత్రులు, ఎంపీలు సత్కరించారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో బీజేపీ, టీడీపీ, జేడీయూ, ఎల్‌జేపీఆర్ శివసేన, జేడీఎస్ సహా ఎన్‌డీఏలోని ఇతర పార్టీల ఎంపీలు హాజరయ్యారు. రాజకీయం, పాలనాపరమైన అంశాలు సహా బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధాని, ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

# ప్రస్తుత లేబర్ కోడ్ లతో శ్రామికులకు తీవ్ర నష్టం

## ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి,(ప్రభాత ఉదయం)**

శ్రమ దోపిడిని పెంచుకునేందుకే బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్,లు తీసుకొచ్చారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు.రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ చౌరస్తాలో ఏఐటీ యూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో లేబర్ కోడ్,లను రద్దు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య హాజరై వారు మాట్లాడుతూ...యజమా నులు కార్మికుల దోపిడీకి లేబర్ కోడ్ సాధనాలుగా ఉపయోగపడే విధంగా మోడీ ప్రభుత్వం రూపొందించిందని అన్నారు.కార్మిక చట్టాలను మార్చి వాటి స్థానంలో లేబర్ కోడ్,లను తీసుకురా వడం ప్రధాన ఉద్దేశమన్నారు.కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడమే అని అన్నారు.లేబర్ కోడ్,లు ఆర్థిక నేరగాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా తయారు చేశారని అన్నారు.దీంతో దేశ




అభివృద్ధికి,ప్రజల కొనుగోలు శక్తికి అవ రోధంగా మారుతుందని అన్నారు.రాజ కీయ నాయకులు,ప్రజాప్రతినిధులు వ్యాపారాలలోకి ప్రవేశించిన తర్వాత లేబర్ కోడ్ లాంటి చట్టాలను,కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలుగా రూపొందించ డంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు.లేబర్ కోడ్ లు కార్మికుల ఉద్యోగ భద్రతకు,జీతాల పెరుగుదలకు తీవ్ర ఆటంకంగా మారుతాయి అని అన్నారు.ఉద్యోగ భద్రత లేని లేబర్ కోడ్ లను రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదని అన్నారు.ఈ సందర్భంగా దేశవ్యా ప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికు లకు పిలుపునిచ్చారు.అనంతరం ఏఐటి యుసి జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి,భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు నర్రగి రిలు మాట్లాడుతూ...అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు లేబర్ కోడ్ లు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తాయని అన్నారు.స్వతంత్ర పోరాటం ముందు పోరాటం అనంతరం సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం అంటే స్వతంత్ర పోరాట వీరులను అవమానపర చడమే అని అన్నారు.సంఘటిత,అసం ఘటిత రంగాల కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నర్రగిరి,వి నయ్,యుగంధర్ రెడ్డి,జగన్,సురేష్, జాస్వ,పెంటయ్య,రమేష్,ఆనంద్,బాల్ రాజ్,నరేందర్,నరసింహ,బాబు,సత్యం, మల్లేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.




తప్పిపోయిన బాలికను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

## తప్పి పోయిన బాలికను తల్లి చెంతకు చేర్చిన అత్తాపూర్ పోలీసులు

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం):**

అత్తాపూర్ పాండురంగానగర్ లో తప్పి పోయిన ఐదు సంవత్సరాల బాలిక ఆచూకి ని కనుగొని ఆమె తల్లికి అప్పగించిన సంఘటన ఇది. ఈ సం ఘటన మంగళవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు కథనం ప్రకారం.. పాండురంగానగర్ కు చెందిన సోని కి చెందిన ఐదు సంవత్సరాల కుమార్తె ఆడుకుంటు తప్పిపోయింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. హెడ్ కాని స్టేబుల్ కె రాజు నాయక్ చాకచక్యంగా వ్యవహరించి వాట్సాప్ ద్వారా ఆ బాలిక ఫోటోను తెలిసిన వారికి పెట్టి అతి తక్కువ సమయంలోనే ఆ బాలిక ఆచూకి ని కనుగొని తల్లికి అప్పగించారు.

## హంకాంగ్ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు ఎంపికైన సుజల్ సింగ్

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**



హాంకాంగ్ లోని అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు పద్మశాలిపురం లోని సాయి గ్రామర్ హై స్కూల్ విద్యార్థి సుజల్ సింగ్ ఎం పికైనారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ శ్రీలక్ష్మి తెలిపారు. నాలేడ్జ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (క్యాట్) అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో టాప్ టెన్ లో ప్రధమ స్థానం లో నిలిచి హాంకాంగ్ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు ఎంపికైనార న్నారు. టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన కే వీర్. పి.లాస్య శ్రీ, హిమాన్స్ భుయాన్ లు డిల్లీ, కోల్ కతా లోని జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు, మరో 14 మంది విద్యార్థులు హైదరాబాద్ లోని ప్లాని టోరియం సందర్శనకు ఎంపికైనారన్నారు. ఈ విద్యార్థులు పాఠశాల యాజమాన్యం మంగళవారం అభినందించారు.

## భార్యతో పాటు మరో వ్యక్తిని చంపడానికి ప్రయత్నించిన వ్యక్తి అరెస్ట్

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

దొంగతనాలు, స్నాచింగ్ లకు పాల్పడుతు తరచు జైలుకెళ్లే భర్తకు దూరంగా ఇద్దరు పిల్లలతో కలసి ఎనిమిది సంవత్సరాలుగా ఉంటున్న భార్యను ఆమెకు సహకరిస్తున్న మరో వ్యక్తిని హత్య చేయాలని ప్రయత్నించిన ఓ వ్యక్తిని మైలార్దేవుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్ కు తరలించారు. వివరాలు ఈ విదంగా ఉన్నారు 3..... మహరాష్ట్ర లాతూర్ కు చెందిన శంకర్ బిరడా, శారధ బిరడా లు భార్య భర్తలు. వీరికి ఇద్దరు సంతానం. శంకర్ బిరడా నేరాలకు పాల్పడుతు దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లు చేసేవాడు. అతనిపై 52 కేసులు ఉన్నాయి. భర్తపై కేసులు ఉండటం, తరచు పోలీసులు వచ్చి వేదిస్తుండటంతో శారధ బిరడ ఎనిమిది సంవత్సరాల క్రితం లాతూర్ నుంచి భర్తకు దూరంగా మైలార్దేవుపల్లి ప్రగతి కాలనీ కి వచ్చి ఉంటుంది. పలు కేసుల్లో జైలుకు వెళ్లి ఇటీవల బయటకు వచ్చిన శంకర్ బిరడా భార్య మైలార్దేవుపల్లి ప్రగతి కాలనీలో ఉంటుందని తెలుసుకుని ప్రగతి కాలనీ కి వచ్చాడు. భార్యతో గొడవ పడుతు న్నాడు. అది చూసి పక్కనే నివాసం ఉండే శారధ బిరడా అన్న స్నేహితుడు గొడవ పడ వద్దని సూచించాడు. దీంతో కక్ష పెంచుకున్న శంకర్ బిరడా మైలార్దేవుపల్లి ప్రగతి కాలనీ కి వచ్చి ఉంటుంది. పలు కేసుల్లో జైలుకు వెళ్లి ఇటీవల బయటకు వచ్చిన శంకర్ బిరడా భార్య మైలార్దేవుపల్లి ప్రగతి కాలనీలో ఉంటుందని తెలుసుకుని ప్రగతి కాలనీ కి వచ్చాడు. భార్యతో గొడవ పడుతున్నాడు. అది చూసి పక్కనే నివాసం ఉండే శారధ బిరడా అన్న స్నేహితుడు గొడవ పడవద్దని సూచించాడు. దీంతో కక్ష పెంచుకున్న శంకర్ బిరడా ఈ నెల 1వ తేదీన శారద బిరడా ఇంటికి వెళ్లి ఆమెను, ఆమెకు సహకరి స్తున్న వ్యక్తిని చం పడానికి కత్తి తీశాడు. దీంతో ఆమె మైలార్దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం శంకర్ బిరడ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిం చారు.



## కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలి:వజ్రేష్ యాదవ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అలియాబాద్ మున్సిపల్ ) ఫిబ్రవరి 03 ( ప్రభాత ఉదయం ):**


జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ముదుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్య ర్థులకు బి ఫారాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని అన్నారు. ప్రజాపాలనకే ప్రజలు పట్టం కడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పరమేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి: ఔరాది రమేష్ ముదిరాజ్

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(ప్రభాత ఉదయం)**

పరమేశ్వరుని కరుణ,కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం భవానీకాలనీకి చెందిన ఔరాది రమేష్ ముదిరాజ్ అన్నారు.శివస్వా ములు దీక్షలో భాగంగా పాదయాత్రగా నారాయణఖేడ్ జరాసంగం తుర్కవాడగామా నుంచి శ్రీశైలంకు సుమారు 300 మంది స్వాములు బయలుదేరారు.ఈ పాదయాత్ర బాలానగర్ లోని అమ్మపల్లి దేవాలయానికి చేరుకుంది.అక్కడ అమ్మవా రిని,ఆ పరమేశ్వరుడిని స్వాములు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఔరాది రమేష్ ముదిరాజ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు



నిర్వహించారు.అనంతరం శివ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు.ఈ శివదీక్షను గురుస్వామి వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో పాదయా త్రగా ప్రతియేడు కొనసాగుతుందన్నారు.శివస్వాములు,భక్తులు సుమారు 400 కిలో మీటర్ల పాదయాత్రను పది రోజుల పాటు కొనసాగిస్తారని,శ్రీశైలంలో స్వామిని దర్శిం చుకున్న అనంతరం పాదయాత్ర ముగుస్తుందన్నారు.ఈ పాదయాత్రలో శివ దీక్ష స్వాములు,భక్తులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సారధ్యంలో పార్టీ బలోపేతం..

### నేడు తెలంగాణకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఘన స్వాగతం పలుకాలని పిలుపు..

### మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(ప్రభాత ఉదయం)**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సారధ్యంలో పార్టీ బలోపేతానికి శ్రమించడం జరుగుతుందని బీజేపీ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు.తె లంగాణ రాష్ట్రానికి మొదటిసారి నితిన్ నబిన్ రానున్న సందర్భంగా మంగళవారం కాటేదాన్‌లోని అయ్యప్ప ఆలయం సమీపంలో ఒక సన్నాహక సమావేశం నిర్వహించారు.ఆయన ఉదయం 11 గంటలకు శంషాబాద్ విమా నాశ్రయానికి చేరుకోనున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకాలని సమావేశంలో నిర్ణయించారు.గగన్‌పహాడ్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి,బీజేపీ శక్తిని,ఐక్య తను ప్రజలకు చాటాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కడ్డం సుధాకర్,జోగు రవికుమార్,రావుల భాస్కర్,అడికె మహేందర్,బొమ్మ రాజు నర్సింహ,వెంకట్ రమణ గుప్తా,ఎన్.మురళీధర్ రెడ్డి,జి.శ్రావణ్,గుదురు అంజి,బల్లా శ్రీనివాస్ యాదవ్,వై.ప్రభాకర్,కొండల,రాజేష్,అరుణ్,సాయి తేజ,సాయి కుమార్,సురేష్ యాదవ్,అంకిత్,పలువురు బీజేపీనాయకులు,కార్య కర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## నేడు కాటేదాన్, మైలార్ దేవ్ పల్లి లలో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3(ప్రభాత ఉదయం)**

కాటేదాన్, మైలార్దేవ్పల్లి లలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఆయా సెక్షన్ల ఇంజనీర్లు ప్రవీణ్, శ్రీనివాసులు తెలిపారు. మైలార్దేవ్పల్లి లోని రెహమత్ కాలనీ ఫీడర్ క్రిస్టల్ టౌన్, రెహమత్ కాలనీ, జహంగీరాబాద్,జహంగీరరాబాద్, క్రిస్టల్ టౌన్, మిలత్ నగర్, రీగల్ గార్డెన్ ఫీడర్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు సుభన్ కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, ఐషా కాలనీ, మిలన్ కాలనీ, అన్మోల్ గార్డెన్ బ్యాక్ సైడ్, తమిళ తమిళ్ బస్తి లలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు .విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**కాటేడాన్ లో...**

కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం సర ఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. మధ్యాహ్నం 14:00 గంటల నుండి సాయంత్రం 17:00 గంటల వరకు లక్ష్మీగూడ గ్రామం, ఆర్‌జికె (పింక్ క్వార్టర్స్ & వైట్ క్వార్టర్స్), గణేష్ నగర్, బృందావన్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, వాంబే కాలనీ, నిత్య వెంచర్, టిఎన్‌జిఓఎస్ కాలనీ, అమ్మ గార్డెన్స్, పయనీర్ స్కూల్, శ్యామ టెంట్ హౌస్, బాబా టెంట్ హౌస్, బాలాజీ నగర్, మోడీ బిల్డర్స్, పారిశ్రామిక ప్రాంతం, స్విమ్మింగ్ పూల్ ప్రాంతం, మల్లన్న దేవాలయం ప్రాంతం, కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

విద్యుత్ నిర్వాహణ పనుల నిమిత్తం ఈ నెల 4వ తేదీన మద్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాటేదాన్ ఏఈ ఓ ప్రవీణ్ ప్రకటన లో తెలిపారు. లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప(ఫిం క్ క్వార్టర్స్, వైట్ క్వార్టర్స్), గణేష్ నగర్, బృందావన్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, వాంబే కాలనీ, నిత్య వెంచర్, టీఎన్జీవోస్ కాలనీ, అమ్మ గార్డెన్, పయనీర్ స్కూల్, శ్యామ టెంట్ హౌస్, బాబా టెంట్ హౌస్, బాలాజీన గర్, మోడీ బిల్డర్స్, పారిశ్రామిక ప్రాంతం, స్విమ్మింగ్ఫూల్ ప్రాంతం, మల్లన్న దేవాలయ పరిసరాలు, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కరెంటు సరఫరాలో అంతరాయ ఉంటుందన్నారు.

**గ్రీన్ విచ్ సబ్ స్టేషన్ నిర్వాహణ కారణంగా....**

గ్రీన్ విచ్ సబ్ స్టేషన్ నిర్వాహణ పనుల నిమిత్తం ఈ నెల 4వ తేదీన మద్యాహ్నం 2 గంటల ను ంచి 5:30 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని మైలార్దేవుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. దాని ప్రకారం... క్రిస్టల్ టౌన్, రహ్మతాకాలనీ, జహంగీరాబాద్, మిలాత్నగర్, సుబాన్ కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియ, అయేషా కాలనీ, మిలాన్ కాలనీ, అన్మోల్ గార్డెన్ వెనుక బాగం, తమిళ బస్తీ ప్రాంతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుంద న్నారు.

# కాంగ్రెస్ పెద్దల హైడ్రామా





## బలైన... సరిత వర్గీయులు

**కాంగ్రెస్ పార్టీలో మాజీ జెడ్పీ చైర పర్సన్ సరిత కు మొండిచేయి**

**నామినేషన్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే వర్గీయుల హైడ్రామా**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3(ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత మధ్య గత కొంత కాలంగా మున్సిపల్ టిక్కెట్లు మాకంటే మాకే వస్తాయని చెప్పుకోవడంతో ఆశావాహుల్లో ఆశలు రేకెత్తాయి. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావడంతో కాంగ్రెస్ పార్టీ అదిష్టానం, ముఖ్య నాయకుల డ్రామాల మధ్య సరిత వర్గీయులకు మొండి చేయి చూపెట్టారు అధిష్టానం ఇద్దరి నేతలతో మాట్లాడి ఓ వర్గానికి 25, మరో వర్గానికి 12 వార్డులు ఇస్తారంటూ వచ్చిన వార్తలు పుకార్లుగా కనిపిస్తోంది. తీరా మున్సిపల్ ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో 37వార్డులకు సంబంధించిన భీఫాంలు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థులకు అందజేసినట్లు సమాచారం అందడంతో మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత వర్గీయుల ఆందోళన మొదలైంది. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారికి కాదని బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వర్గీయులకు అందజేశారని నమ్మించి మోసం చేశారని సరిత వర్గీయులు ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన టిక్కెట్లు ఇవ్వడానికి ముందుకు రాలేదు. దీంతో మాజీ జెడ్పీ సరిత వర్గీయులు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెబెల్ అభ్యర్థులుగా బరిలో దిగనున్నారు.

**సరిత వర్గీయులకు మొండి చేయి**

మొదట డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వర్గానికి చెందిన 37మంది కాంగ్రెస్ అభ్యర్థులకు భీఫామ్ లు అందజేశారు. ఆ తర్వాత మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత వర్గానికి 7 వార్డులకు సంబంధించిన అభ్యర్థులకు భీఫాంలు అందజేశారు. మంగళవారం ఉదయం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వర్గానికి చెందిన 37 మంది అభ్యర్థులు తమ భీఫాంలు ఎన్నికల అధికారులకు సమర్పించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం ఉపసంహరణతో పాటు ఆయా పార్టీల భీఫామ్ లు సమర్పించేందకు మంగళవారం మద్యాహ్నం మూడు గంటలకు ఆఖరి రోజు కావడంతో గద్వాల మున్సిపాలిటి వద్ద నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులతో పాటు నాయకుల్లో గందరగోళం మొదలైంది. ఎన్నికల నిబంధనల ప్రకారం మొదట బీఫాంలు సమర్పించిన వారికే కాంగ్రెస్ పార్టీ గుర్తు కేటాయిస్తారని వినికిడి. అంతే కాకుండా బీఫాంలతో పాటు సీ ఫాంలు తప్పనిసరిగా సమర్పించడం కీలకం కావడంతో.. మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత వర్గీయుల వార్డు అభ్యర్థులు సమర్పించిన బీఫాంలు చెల్లవనీ తేలడంతో సరిత వర్గీయుల ఆశలు అడియాసలు అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నుండి బీఫాంలు అందవని తెలిసిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

**ఏడుగురికి బీఫాంలు అందజేత**

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత వర్గీయులకు 7 వార్డులకు సంబంధించి బీఫాంలు అందజేశారు. అప్పటికే గద్వాల ఎమ్మెల్యే బండ్ల బలపరిచిన 37వార్డుల అభ్యర్థులకు భీఫాంలు అందజేయడంతో వారు ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఆ తర్వాత సరిత బలపరిచిన అభ్యర్థుల్లో 8,10,11, 12,14, 29,36 వార్డుల అభ్యర్థులకు బీఫాంలు అందజేశారు. వారిలో 11 వ వార్డు అభ్యర్థి తాము ఈ ఎన్నికల్లో పోటీ చేస్తలేమంటూ.. నామినేషన్ ఉపసహరించుకున్నారు. మిగత వార్డు అభ్యర్థులు కూడా బీఫాంలు ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఇందులో 14వ వార్డు అభ్యర్థి శంకర్ తప్ప మిగతా 5మంది బీఫాంలు చెల్లవని తేలడంతో.. చెల్లని బీఫాంలు ఎందుకు అందజేశారని డీసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ డబుల్ బీఫాంలు ఎందుకు అందజేశారని, అవగాహన ఉండి చేశారా లేక అన్నీ తెలిసి చెల్లని బీఫాంలు అందజేసి మమ్మల్ని నమ్మించి మోసం చేశారా అని ఆరోపణలు వినిపిస్తున్నాయి.




## జిహెచ్ఎంసిలో విలీనం...

# అయినా మారని వైనం

**బొల్లారం డివిజన్ లో ఇప్పటికీ దర్శనమిస్తున్న మున్సిపల్ బోర్డులు**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం):**

జిహెచ్ఎంసి పరిధి విస్తరణ పేరుతో 27 మున్సిపాలిటీలలను గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేసిన అధికారులు. విస్తరణ పరిధిని కేవలం కాగితాలకే పరిమితం చేసి చేతులు దులుపుకున్నారు తప్ప కనీసం బోర్డులను కూడా మార్చడం లేదని చూసిన ప్రతి ఒక్కరికీ అర్థం అవుతోంది. బొల్లారం ప్రాంతాన్ని జిహెచ్ఎంసి 272 డివిజన్ గా ప్రకటించారు కానీ నేటి వరకు కనీసం సూచిక బోర్డులను కూడా మార్చకపోడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. గత నెల వరకూ మున్సిపాలిటీ కార్యాలయం గా సేవలు అందించిన భవనానికి కూడా వ్యవస్థ అంతా మారినా జిహెచ్ఎంసి, డివిజన్ పేరు లేకపోవడం విశేషం.

# కొడవటూరులో వృద్ధుడి పై గుర్తు తెలియని జంతువు దాడి...!?

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03(ప్రభాత ఉదయం):**

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం, కొడవటూరు గ్రామంలో బుధవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మినలాపురం సిద్ధయ్య తన రోజువారీ పనుల నిమిత్తం బావి దగ్గరికి వెళ్తుండగా, ఒక్కసారిగా ఓ గుర్తుతెలియని జంతువు ఆయన పై దాడి చేసింది.ఈ దాడిలో లచ్చయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు గ్రామ సర్పంచ్ నీల కవిత మురళి తెలిపారు. గత కొద్ది రోజులుగా జిల్లాలో పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ దాడి జరిగి ఉండవచ్చని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సర్పంచ్ స్పందిస్తూ.. "ప్రజలు ఎవరూ ఒంటరిగా అటవీ ప్రాంతాలకు లేదా పొలాలకు వెళ్లకూడదని, చీకటి పడకముందే పనులు ముగించుకుని సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని,. పశువులను కూడా బయట ఉంచకుండా ఇండ్లలో కట్టేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటవీ శాఖ అధికారులు స్పందించి సదరు జంతువును గుర్తించి పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





పదవి విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

## జలమండలిలో 12 మంది ఉద్యోగులు పదవీ విరమణ

**ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

జలమండలిలో పనిచేస్తున్న పన్నెండు మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. మంగళవారం ఖైరతాబాద్ లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ జీఎం సరస్వతి, డీజీఎం హరి శంకర్ తో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమర్థవంతంగా...ఎన్నికల విధులు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03(ప్రభాత ఉదయం):**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ఆదేశాల మేరకు జిల్లా శిక్షణ నోడల్ అధికారి మధురి షా సమన్వయంతోప్రిసైడింగ్ అధికారులు (పిఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు) కోసం ఐడిఓసి, జనగాంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హల్ లో ఏర్పాటు చేసారు.తెలంగాణ మున్సిపాలిటీలు చట్టం, 2019, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా, పోలింగ్ విధానాలపై మాస్టర్ ట్రైనర్లు సంపూర్ణ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి పూర్తి బాధ్యతలు అధికారాలు తెలుసుకోవాలని,ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్‌బుక్ ఒక మార్గదర్శక పుస్తకమని ఎన్నికల చట్ట నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు.బ్యాలట్ బాక్సులను తెరవడం, మూసివేయడం, సీలింగ్, భద్రపరచడంబ్యాలట్ పేపర్ల జారీ, నిర్వహణ, లెక్కల తయారీ,ఓటరు గుర్తింపును రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు పత్రాల ఆధారంగా మాత్రమే నిర్ధారించాల్సిన విధానం ఇండెలిబుల్ ఇంక్ వినియోగం ద్వారా ద్వంద్వ ఓటింగ్ నివారణ, ఓటు గోప్యత పరిరక్షణ క్యూల నియంత్రణ, మార్క్డ్ ఓటరు జాబితా, ప్రిసైడింగ్ ఆఫీసర్ డైరీ, బ్యాలట్ పేపర్ అకౌంట్ వంటి చట్టబద్ధ రికార్డుల సరైన నిర్వహణ పోలింగ్ ప్రారంభం, పోలింగ్ కొనసాగింపు, పోలింగ్ ముగింపు అనంతర ప్రక్రియలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.తక్కువ వయస్సు అనుమానం ఉన్న ఓటర్లు, కౌంటర్‌ఫాయిల్‌పై సంతకం చేయని సందర్భాలు, పోలింగ్ ముగింపు సమయానికి క్యూలో ఉన్న ఓటర్లకు అనుసరించాల్సిన విధానాలని పిఓ, ఏపీవోలు తెలుసుకోవాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని జనరల్ ఆబ్జర్వర్ నరసింహారెడ్డి పర్యవేక్షించి, పోలింగ్ సిబ్బందితో పరస్పర చర్చలు జరిపారు.ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతత్వం, క్రమశిక్షణ, చట్టపాలన తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లోమాస్టర్ ట్రైనర్లుమెరుగు రామరాజు, కె. సురేందర్ రెడ్డిఎన్నికల చట్టాలు, ప్రాయోగిక అంశాలపై లోతైన శిక్షణ అందించారు.ఈ కార్యక్రమం లో జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి,ఘన్పూర్ స్టేషన్, రాధా కృష్ణ, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ఊడ్చి ఊడ్చి ఊడుస్తూ... జీతాలు రాక ఏడుస్తూ...

## కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల దుర్గతి..ఆదుకోవాలని వినతి.

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం):**

సూర్యుడు ఇంకా పూర్తిగా ఉదయించకముందే, నగర రోడ్లపై, గల్లీల్లో, డ్రైనేజీల దగ్గర ఊడ్చి ఊడుస్తూ.. మనలా మనుషులుగా కాకుండా, యంత్రాల్లా పనిచేస్తున్నారు వీరు. మన ఇళ్లు, కాలనీలు, కార్యాలయాలు, ఆసుపత్రులు స్వచ్ఛంగా ఉండాలంటే ఈ మనుషులు తమ ఊపిరి, తమ ఆరోగ్యం, తమ జీవితాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారు. కానీ, ఆ పనికి తగిన గౌరవం? తగిన జీతం? తగిన భద్రత? ఏమీ లేదు.జిహెచ్ఎంసి పరిధిలో వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులు రోడ్లపై బతకటానికి పోరాడుతున్నారు. ప్రైవేటైజేషన్ పేరుతో వారి ఉద్యోగాలు గుత్తేదారుల చేతికి ఇచ్చేసి, జీతాలు తగ్గించి, భద్రత లేకుండా చేస్తున్నారు. ఒకప్పుడు నగర సంస్థలో పనిచేసిన వారే ఇప్పుడు గుత్తేదారు కంపెనీల దయాదాక్షిణ్యాలపై బతుకుతున్నారు. జీతాలు రెండు,మూడు నెలలు ఆలస్యమవుతున్నాయి. ఇంటి అద్దె, పిల్లల చదువు, రోగాలకు మందులు ఏదీ చెల్లించలేక ఏడుస్తున్నారు. "ఊడ్చి ఊడ్చి ఊడుస్తున్నాం... కానీ మా జీతాలు, జీవితాలు ఊడిపోతున్నాయి" అంటూ ఒక కార్మికుడు చెప్పాడు. ఒంటరి మహిళలు,దళితులు, మహిళలు, వలస కార్మికులు ఈ వర్గాల నుంచే ఎక్కువ మంది పారిశుద్ధ్య వృత్తిలో ఉన్నారు. ఉదయం నాలుగు గంటలకు లేచి, సాయంత్రం వరకు పని. రక్షణ పరికరాలు లేవు. డ్రైనేజీల్లోకి దిగితే ప్రాణాలు పోయే ప్రమాదం. ఆసుపత్రులు, ప్రమాద బీమా, పెన్షన్ ఏమీ లేదు. జీతం మాత్రం నెలకు కేవలం 15 వేల నుంచి 17 వేల రూపాయల మధ్యనే అది కూడా ఆలస్యంగా, కోతలతో వస్తుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాంట్రాక్ట్ స్వచ్ఛత కార్మికులు ఇదే దయనీయ స్థితిలో ఉన్నారు.

ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే మనం స్వచ్ఛ భారత్ అంటున్నాం. నగరాలు మెరిసిపోతున్నాయి అంటున్నాం. కానీ ఆ మెరుపు వెనుక ఈ కార్మికుల కన్నీళ్లు, రక్తం, చెమట ఉంది. ఓ వైపు ప్రైవేటైజేషన్ పేరుతో గుత్తేదారులు లాభాలు గుంజుకుంటున్నారు. కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత ఇవ్వడం లేదు. కొత్త లేబర్ కోడ్స్‌లు వచ్చాయి అంటున్నారు , కానీ మరోవైపు ఈ కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదు. ఈ దేశంలో "స్వచ్ఛత" అనేది ఒక ఉద్యమంగా మారింది. స్వచ్ఛత పేరుతో ఎన్నో రకాల సందేశాత్మక ప్రచారాలు, కార్యక్రమాలు జరుగుతున్నాయి. కానీ ఆ ఉద్యమంలో పాల్గొన్న వారి జీవితాలు మాత్రం నేటికీ "అస్వచ్ఛ"గానే ఉన్నాయి. వీళ్ళు రోడ్లు ఊడ్చి ఊడ్చి ఊడుస్తూ... జీతాలు రాక ఏడుస్తూ... ఇలా ఎంతకాలం గడపాలి.! ఈ విషయం గురించి ప్రభుత్వాలు, నగర సంస్థలు, సమాజం





అందరూ ఆలోచించాలి. మనందరి కోసం పనిచేస్తున్న ఈ కార్మికులకు కనీసం నెలకు గౌరవప్రదమైన జీతం, సమయానికి చెల్లింపు, ఆరోగ్య భద్రత, ఉద్యోగ స్థిరత్వం ఇవ్వాలి. లేకపోతే మన నగరాలు ఎంత స్వచ్ఛంగా ఉన్నా మన మనసులు, మన సమాజం ఎప్పటికీ అపవిత్రంగానే ఉంటాయి.

దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రాంతం పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని డివిజన్లు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికుల వెతలు హైదరాబాద్ మహానగర జిహెచ్ఎంసీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో జీతాలు లేక అనేక అగచాట్లు పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంలో ఒకటైన పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. నియోజకవర్గ పరిధిలో ఉన్న మున్సిపాలిటీలతోపాటు , జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు గత మూడు నెలలుగా జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. తినడానికి తిండి, ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు, మందుల ఖర్చులకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని పారిశుద్ధ్య కార్మికులు "ప్రభాత ఉదయం" వద్ద వాపోయారు. పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని హామీలు ఇస్తున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కేవలం మాటలు మాత్రమే చెప్పడం తప్ప తమకు న్యాయం చేయడం లేదని వారు అసహనం వ్యక్తంచేశారు. కనీస వేతనం సంగతి అటుంచి తమ కష్టానికి ఇవ్వవలసిన జీతం డబ్బులు కూడ ఇవ్వడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ జీతం బకాయిలను వెంటనే ఇప్పించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో టి ఆర్ పి జెండాను ఎగురవేస్తాం: తీన్మార్ మల్లన్న

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మూడు చింతలపల్లి ) ఫిబ్రవరి 03 ( ప్రభాత ఉదయం):-**



మేడ్చల్ నియోజకవర్గం లోని మూడు చింతలపల్లి యెల్లంపేట మున్సిపాలిటీలలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎగుర వేస్తామని తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో పలు మున్సిపాలిటీ లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నుండి ఎన్నికల బరిలో మూడు చింతలపల్లి యెల్లంపేట్ లకు సంబంధించిన పలు వార్డుల లోని అభ్యర్థులుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న బి ఫాములను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎగరవేస్తామని అన్నారు. అన్ని మున్సిపాలిటీలలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థుల గెలుపు తథ్యమని ఆయన జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చక్ర పాణిగౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన అధ్యక్షులు సింగం అరుణ్ పటేల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు షాలిని, టి ఆర్ పి నాయకులు బాబు తది తరులు పాల్గోనారు.

# క్యాన్సర్ మహమ్మారిపై అవగాహనే ఆయుధం

## ముందస్తు గుర్తింపుతో ప్రాణలను కాపాడుకోచ్చు.. నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

**శేరిలింగంపల్లి , ఫిబ్రవరి 3,(ప్రభాత ఉదయం)**



మనిషిని మానసికంగా శారీరకంగా ఆర్థికంగా కుంగదీసే మహమ్మారి క్యాన్సర్. ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే ఈ వ్యాధి నేడు మారుతున్న జీవనశైలి కారణంగా యువతను సైతం కబళిస్తోంది. మన దేశంలో ఏటా 15 లక్షల మందికి పైగా కొత్తగా క్యాన్సర్ బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఆధునిక వైద్యం సరైన ఆహార నియమాలు, ముందస్తు గుర్తింపుతో ఈ మహమ్మారిని ఓడించడం సాధ్యమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.

"క్యాన్సర్ ని ముందస్తు గుర్తిస్తే" చికిత్సకు తొలి అడుగు

క్యాన్సర్ వచ్చిన తర్వాత బాధపడటం కంటే, అది వ్యాప్తిచెందకుండా గుర్తిస్తే మహమ్మారిని ఓడించ వచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.

శరీరంలో ఎక్కడైనా గడ్డలు ఏర్పడితే పరీక్షలు చేయించు కోవడం ఉత్తమంటు న్నారు.

**ముఖ్య లక్షణాలు**

క్యాన్సర్ ప్రారంభ దశలో

ఆకలి మందగించడం, అకస్మాత్తుగా బరువు తగ్గడం.

దీర్ఘకాలికంగా తగ్గని దగ్గు, గొంతు బొంగురుపోవడం.

చర్మంపై పుట్టుమచ్చల రంగు లేదా పరిమాణం మారడం.

ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. తొలి దశలోనే గుర్తిస్తే 90 శాతం వరకు నయం చేసే అవకాశం ఉంటుందని వైద్యులు వివరిస్తున్నారు.

**కొత్త పుంతలు తొక్కుతున్న వైద్య విధానాలు**

గతంలో క్యాన్సర్ అంటే కేవలం కీమోథెరపీ, రేడియేషన్ మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ ప్రస్తుతం విప్లవాత్మకమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి

ఇమ్యునోథెరపీ శరీరంలోని వ్యాధి నిరోధక కణాలనే క్యాన్సర్ కణాలపై పోరాడేలా చేయడం.


టార్గెటెడ్ థెరపీ ఆరోగ్యకరమైన కణాలకు నష్టం కలగకుండా కేవలం క్యాన్సర్ కణాలనే నాశనం చేసే పద్ధతి.

రోబోటిక్ సర్జరీ

రక్తస్రావం తక్కువగా త్వరగా కోలుకునేలా చేసే ఆధునాతన శస్త్రచికిత్సలు.

**ఆరోగ్యమే మహాభాగ్యం ఆహార నియమాలే శ్రీరామరక్ష**

క్యాన్సర్ నివారణలో మనం తీసుకునే ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్స్ ఆయా కాలాలలో వచ్చే తాజా పండ్లు, ఆకుకూరలు శరీరంలోని కణాలను రక్షిస్తాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. జంక్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన మాంసం, అధికంగా వేయించిన పదార్థాలు, రసాయనాలు కలిపిన పానీయాలకు దూరంగా ఉంటే బాగుటుందని సూచిస్తున్నారు. పొగాకు, ధూమపానం, మద్యపానం క్యాన్సర్‌కు ప్రధాన కారకాలు చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరుతున్నారు. క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించడం కేవలం వైద్యుల బాధ్యత మాత్రమే కాదని సమాజంలో ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా అవగాహన పెంచుకోవాలని వైద్యులు చెప్తున్నారు. ఫిబ్రవరి 4ప్రపంచం క్యాన్సర్ డే పులష్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిరక్షణకు, సామాజిక అవగాహనకు కంకణబద్ధులు కావాల్సిన అవసరం ఉంది. భయం వద్దు అవగాహన ముద్దు! "నిర్లక్ష్యం వద్దు నివారణ ముఖ్యం" అనే నినాదం ప్రతి ఒక్కరు ముందు వెళ్ళాలని క్యాన్సర్ విభాగం వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



# కష్టపడితే మనదే విజయం..

**టిక్కెట్ రాని నేతలు అధైర్య పడొద్దు.**

**పార్టీ పదవులు నామినేటెడ్ పోస్టులలో వారికి ప్రాధాన్యం..**

**ఐక్యంగా పనిచేస్తే ఐదు మున్సిపాలిటీలు మనవే..**

**బీఫాంలు అందించిన మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు, పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కష్టపడి ప్రజల్లోకి తీసుకుని వెళ్తే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు, పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఐదు మున్సిపాలిటీల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ ఫాం లను అశోక్ నగర్ లోని కాట నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు ఉన్న నాయకులనే కౌన్సిలర్ అభ్యర్థులుగా టికెట్లు కేటాయించినట్లు తెలిపారు. టికెట్ల కేటాయింపులు సర్వే ఆధారంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు వివరించారు. టికెట్లు రాని అభ్యర్థులు అధైర్య పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులలో టికెట్ రాని నేతలకు పెద్దపీటవేస్తామని హామీ ఇచ్చారు. ఆ నేతలు నిరుత్సాహపడకుండా ఆయా వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలని కోరారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.



నినాదాలు చేస్తున్న ఏ ఐ టీ యూ సీ నాయకులు

# పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె ను విజయవంతం చేయాలి

**నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి**

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం):**

కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే వేలాది మంది కార్మికులు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో పాల్గొనాలని ఏఐటీయుసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, సీఐటీయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ లు కోరారు. కాటేదాన్ సీఐటీయు కార్యాలయంలో మంగళవారం ఏఐటీయుసీ, సీఐటీయు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్మికులకు ఇబ్బందులు గా మారిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాడుతూనే ఉండాలన్నారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కార్మికుల చేత ఎక్కువ గంటలు పనిచేయించుకుని మోసం చేస్తున్నారన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మిక వర్గానికి సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు బేరసారాలు లేకుండ చేసిందన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన 29 కార్మిక చట్టాలను లేకుండ చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దయ్యే వరకు పోరాటం ఆగదన్నారు. పిబ్రవరి 12న జరిగే సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయ సీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి, నాయకులు జె విజయానంద్ గౌడ్, ఆనంద్ గౌడ్, జి.సత్యం, వాణి, క్రిష్ణ, సదానందం గౌడ్, రామచంద్రయ్య, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు పీసీకే భాస్కర్, బచ్చల కూర స్వామి, కవిత, నరహరి, రామ లు, నరేశ్, ఇమ్రాన్, తిరుమలేశ్, ప్రవీణ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్ర మోహన్



ప్రచారం లో జుకంటి లక్ష్మి -శ్రీశైలం

# 3వ వార్డులో ఇంటింట బిఆర్ఎస్ జోరుగా ప్రచారం...

**వార్డు సమస్య ల పరిష్కారం కోసం కృషి**

**ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి జూకంటి లక్ష్మి శ్రీశైలం..**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03 (ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ 3వ వార్డ్ కాన్సిలర్ అభ్యర్థి జుకంటి లక్ష్మి –శ్రీశైలం ఇంటింటా సోమవారం సాయంత్రం జోరుగా ప్రచారం చేశారు. స్థానిక జీఎంఆర్ కాలనీలో ఓటర్లను కలుస్తూ వార్డులో ఉన్న సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తానని ఓటర్లకు చెప్పుకుంటూ ప్రచారం గావించారు. అలాగే జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారం తో 3వార్డ్ ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వార్డ్ ఇంచార్జ్ లు, ఈదులకాంటి ప్రతాప్ రెడ్డి, అంబటి రాజయ్య, సత్తిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, కక్కర్ల శ్రీనివాస్, జుకంటి మధు–శిరీష, ఎండి అబ్బాస్, బొమ్మెన ఆంజనేయులు, దేవరకొండ మల్లేశం, చింతల వెంకటయ్య, ఏనుగుల కనకయ్య, జి. మహేష్,, ఎన్, తిరుమల రెడ్డి, కి. బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆకతాయిలు చేసే ఇలాంటి సైబర్ మోసాలకు గురికావద్దు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03(ప్రభాత ఉదయం):**

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రొఫైల్ తో వాట్సాప్ లో, ఏ ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే మెసేజ్ లకు ప్రజలు, అధికారులు స్పందించవద్దని సోమవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన లో కోరారుసైబర్ క్రైమ్ లకు సంబందించిన ఇలాంటి చర్యల పైన పోలీసు లకు ఫిర్యాదు చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారుఆకతాయిలు చేసే ఇలాంటి సైబర్ మోసాలకు గురికావద్దని కలెక్టర్ కోరారు

# గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు వ్యక్తులకు 10 సంవత్సరాల జైలు శిక్ష

**ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా**

**జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ తీర్పు**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03(ప్రభాత ఉదయం):**

గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురు వ్యక్తులకు 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ మంగళవారం తీర్పు వెల్లడించారు. 2. జులై 2021 న ఎండు గంజాయిని కారులో అక్రమంగా తరలిస్తుండగా జనగామలోని హైదరాబాద్ రోడ్డు పట్టుపురుగుల పరిశ్రమ వద్ద వాహన తనిఖీలలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కారు నుంచి దిగి పారిపోతున్న రాయపర్తి గుబ్బడి తండకు చెందిన డ్రైవర్ గుగులోతు సుధాకర్, హైదరాబాద్ జుమ్మా దారి బజారుకు చెందిన దినేష్, వర్ధన్నపేట ఇల్లందుకు చెందిన గూగులోతు సురేష్ ల ను వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాలుగు గోనె సంచు లలో ఉన్న రెండు కిలోల ప్యాకెట్ల చొప్పున ఉన్న 126 కిలోల గంజాయిని, కారును మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్ఐ సిహెచ్ రవికుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ బాలాజీ వరప్రసాద్ కేసు దర్యాప్తు జరిపి చార్జీ షీటు కోర్టులో దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ సత్యనారాయణ రెడ్డి కేసులోని సాక్షులను లైసెన్ ఆఫీసర్ బి రమేష్ నేతృత్వంలో కోర్టు కానిస్టేబుల్ బి రమేష్ సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ న్యాయవాది కాచరాజు హరిశ్చంద్రప్రసాద్ కేసును వాదించగా కేసు పూర్వపరాలను, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన జిల్లా జడ్జి నిందితులకు పై శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు. జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ జనగామ పోలీసులను అభినందించారు.



వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను కలసిన క్రీడలలో రాణించిన మహిళా ఉద్యోగులు

# వ్యవసాయ వర్సిటీ క్రీడా పోటీల మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్లుగా నిలచిన రాజేం ద్రనగర్ పరిపాలన భవనం మహిళా ఉద్యోగులు

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

అశ్వారావు పేట్ వ్యవసాయ కళాశాల లో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఆటల పోటీలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలలో వర్సిటీ పరిపాలన భవనం మహిళా ఉద్యోగులు ఓవరాల్ ఉమెన్ చాంపియన్గా నిలిచారు. వారు మంగళవారం రాజేంద్రనగర్ లోని వర్సిటీ పరిపాలన భవనంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ లను కలిశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్ద్రాస్ జానయ్య మహిళా విభాగంలో ఓవరాల్ చాంపియన్లుగా నిలచిన మహిళా ఉద్యోగులను అభినందించారు.

# హాంకాంగ్ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు ఎంపికైన సాయి గ్రామర్ హై స్కూల్ విద్యార్థి సుజల్ సింగ్

## ముగ్గురు కలకత్తా, మరో 9మంది బెంగళూరు కేంద్రాలకు ఎంపిక







**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

హాంకాంగ్ లోని అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు రాజేంద్రనగర్ మైలార్ దేవుపల్లి డివిజన్ పద్మశాలిపురంలోని సాయి గ్రామర్ హై స్కూల్ విద్యార్థి సుజల్ సింగ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ. శ్రీ లక్ష్మీ తెలిపారు. హైదరాబాద్ నగరంలోని నాలెడ్జ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (క్యాట్ ) అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో సాయి గ్రామర్ హైస్కూల్ విద్యార్థి టాప్ టెన్ లో మొదటి ర్యాంకు సాధించి హాంకాంగ్ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి ఎంపికైనట్లు వివరించారు. దీంతోపాటు టాలెంట్ టెస్ట్ లో మంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు కె. వీర్, పి. లాస్య శ్రీ, హిమాన్స్ భుయాన్ లు ఢిల్లీ, కలకత్తా లోని జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు, మరో 9 మంది బెంగుళూరులోని జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్ర సందర్శనకు ఎంపిక కాగా, మరో 14 మంది విద్యార్థులు హైదరాబాదులోని బిర్లా ప్లాంటేరియం సందర్శనకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంతరిక్ష పరిశోధన కేంద్రాలకు తమ పాఠశాల నుండి ఎంపికైన 27 మంది విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న క్యాట్ అకాడమి చైర్మన్ డాక్టర్ అన్వర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్యాట్ అకాడమీ నిర్వహించే టాలెంట్ టెస్టులో తమ పాఠశాల నుండి ప్రతి సంవత్సరము హాంకాంగ్, కలకత్తా, బెంగళూరు అంతరిక్ష పరిశోధన కేంద్రాలకు విద్యార్థులు పెద్ద ఎత్తున ఎంపికైతున్నారని, హాంకాంగ్ అంతరిక్ష కేంద్రానికి గత ఐదు సంవత్సరాలుగా తమ పాఠశాల తరపున విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.



ప్రార్థన యోధుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న సేవకులు, విశ్వాసులు



పాస్టర్ ప్రణీత్ బాబు ను అభినందిస్తున్న ఫెలోషిప్ ప్రతినిధులు

# ప్రార్థన యందు నిలకడగా ఉండాలి

## రెవరెండ్ కె సుందర్ పాల్

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం) :**

ప్రార్థన యందు నిలకడగా ఉండి కృతజ్ఞత గలవారై మెలకువగా ఉండాలని రాజేంద్రనగర్ పోస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె సుందర్ పాల్ అన్నారు. రాజేంద్ర నగర్ ప్రార్థన యోధుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం కో ఆర్డినేటర్ లు రెవరెండ్ జేపీ పాల్ అధ్యక్షతన బుద్వేల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెవరెండ్ కె సుందర్ పాల్ మాట్లాడుతూ, ప్రతి రోజు దైవ సేవకులు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు దేశం కోసం, నాయకుల కోసం, ప్రజల కోసం, సంఘాల కోసం ప్రార్థన లు చేయడం సంతోషకరమన్నారు. నిరంతరం ప్రార్థనలు చేయాలన్నారు. ప్రార్థన ల వల్ల కలిగే ప్రయోజనాలకు దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించే వారిగా ఉండాలన్నారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో చేస్తున్న ప్రార్థనల వల్ల అనేక మేలు లు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో మాట్లాడిన కో ఆర్డినేటర్ రెవరెండ్ ఎన్ రాజారాం మాట్లాడుతూ, ప్రతి రోజు ఎక్కువ సమయం ప్రార్థన చేసేవారిగా ఉండాలన్నారు. ప్రతి మూడు నెలల కు ఒకసారి ప్రార్థన యోధుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుందామన్నారు. జూన్



కో ఆర్డినేటర్ లు

5వ తేదీన రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గెట్ టు గదర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు సమయానికి ప్రార్థన కు వస్తున్న పాస్టర్లు, పాస్టరమ్మలను గులాబి పూలను అందచేసి అభినందించారు. పాస్టర్స్ ఫెలోషిప్ తరపున ప్రార్థన లను ప్రతి రోజు నడిపించడానికి సారథ్యం వహిస్తున్న కో ఆర్డినేటర్ లు రెవరెండ్ జేపీ పాల్, రెవరెండ్ ఎన్ రాజారాం, రెవరెండ్ జె పాల్ దేవరాజ్ లను సన్మానించారు. పాస్టర్ బట్టు శ్రీకాంత్ పాస్టర్ మోజేస్, సిస్టర్ కృపమ్మకు ఆర్థిక సహాయం చేసి దేవుని ప్రేమను కనబరిచారు. రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ పాస్టర్ మోజేస్ కు సహాయం చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు రెవరెండ్ సామ్యూల్ రాజ్ తో పాటు పాస్టర్ స్వర్ణ, పాస్టర్ లీనా దేవదాస్, పాస్టర్ ఎస్ యేసు మణి, పాస్టర్ స్పందన, పలువురు పాస్టర్లు, పాస్టరమ్మలు పాల్గొన్నారు. పాస్టర్ క్రిస్టాపర్ కవితలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బ్రదర్ డానియల్ భీమయ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ మృతి

## రాజేంద్రనగర్ ప్రాంతానికి ఆయన సుపరిచితులు

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

మజ్లిస్ ప్రధాన కార్యదర్శి, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ (72) కు రాజేంద్రనగర్ నియోజకవర్గం కు సుపరిచితులు. ఆయన మొదటి సారి చార్మినార్ నియోజకవర్గం నుంచి 2004 లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ సమయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్దేవుపల్లి, లక్ష్మీగూడ, దుర్గానగర్, వినాయక్ నగర్ ప్రాంతాలు చార్మినార్ నియోజకవర్గం పరిధిలోకే వచ్చేవి. దీంతో ఆయన మైలార్దేవుపల్లి ప్రాంతానికి తరచు వచ్చేవారని మైలార్దేవుపల్లి ప్రజలు చెబుతుంటారు. సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 2004లో చార్మినార్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మైలార్దేవుపల్లి ఆయన పరిధిలోకే వచ్చేదని. ఆయన మా ఇంటికి వచ్చి మా పెద్దనాన్నతో కలిసి మాట్లాడేవారని ఆ బస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నోముల రాము రాము యాదవ్ తెలిపారు. 2009లో



నియోజకవర్గాల పునర్విభజన జరిగి చార్మినార్ నుంచి మైలార్దేవుపల్లి ప్రాంతాలు వేరై రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కలసినప్పటికి 2009లో చార్మినార్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ రాజేంద్రనగర్ పరిధిలోని హసన్నగర్, చింతల్మెట్. ఎం ఎం పహడీ, సులేమాన్ నగర్ ప్రాంతాలలో జరిగే అభివృద్ధి పనులలో చురుకుగా పాల్గొనేవారు. అలా 2017 వరకు ఆయన రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎక్కడ మజ్లిస్ కార్యకర్తకు ఇబ్బంది జరిగినా, పోలీసు కేసులైన ఆయన ఇట్టే వాలిపోయేవారు. ఆ విదంగా సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీకి రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలతో అవినాభావ సంబందాలు ఉం దేవని చెప్పవచ్చు. 1986లో మొదటి సారి డబీర్ పుర వార్డు నుంచి మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ గా సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 1986లో మొదటి సారి డబీర్ పుర నుంచి మజ్లిస్ కార్పొరేటర్ గా గెలుపొం దారు. ఆయన మజ్లిస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ కి అత్యంత సన్నిహితునిగా, నమ్మకస్తునిగా పేరు సంపాదించుకున్నారు. అందుకే ఆయనకు మూడు సార్లు చార్మినార్ ఎమ్మెల్యేగా, ఒక సారి యాకుత్పురా ఎమ్మెల్యేగా మజ్లిస్ పార్టీ అవకాశం ఇచ్చి గెలిపించుకుంది. ఆయనకు ఒక కుమారుడు సయ్యద్ ముర్తుజా పాషా ఖాద్రీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు



# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసేది పత్రికలు: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఏఎస్ రావు నగర్ డివిజన్ ) ఫిబ్రవరి 03 ( ప్రభాత ఉదయం ):-**

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసేది పత్రికలని అన్నారు. మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాసంలో ఉప్పల్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన అధ్యక్షుడు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి మధ్యలో వారధిగా ఉండేటివి పత్రికలను అన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండేది పత్రిక లేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం సమాజాభివృద్ధి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావడంలో మీడియా పాత్ర అత్యంత కీలక మైనదని చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు సమర్థవంతంగా తీసుకెళ్లడంలో మీడియా మిత్రుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. రాబోయే రోజుల్లో ఉప్పల్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజా హిత కార్యక్రమాలకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.



# పంచశీల కాలనీ ప్రజల ఇబ్బందులు తొలగుతాయి: డోలి రమేష్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) ఫిబ్రవరి 03 (ప్రభాత దయం):-**

ఓల్డ్ ఆల్వాల్ లోని విబిఆర్ గార్డెన్ నుండి పంచశీల కాలనీ వరకు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు త్వరలో తొలగిపోతాయని స్థానిక బిఆర్ఎస్ నాయకుడు డోలి రమేష్ అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ నాయకుడు డోలి రమేష్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాదాపు 5 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డుకు అనుమతి పొందిన శుభ సందర్భంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి పాలాభిషేకం చేశామని అన్నారు. విబిఆర్ గార్డెన్ నుండి పంచశీల కాలనీ వరకు ప్రజలు చాలా ఇబ్బందులకు గురైనారని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఇప్పుడు అనుమతి వచ్చినందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పరమేష్, పవన్ కుమార్, శరణ్ గిరి, శోభన్ బాబు, నార్ల సురేష్, నర్సింగ్, చంద్రశేఖర్, భాస్కర్ గౌడ్, పుట్నాల కృష్ణ, బషీర్, సరిత, రమేష్, సులోచన, హరిత ముదిరాజ్, శారద తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ

# ఫీజు బకాయిల తర్వాతే ఇతర పథకాలకు నిధులు కేటాయించాలి

## తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ

**బుద్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను వెం టనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ లో మంగళవారం ఆయన విద్యార్థులతో కలసి మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో యాజామాన్యాలు హాల్ టికెట్ లు ఇవ్వడం లేదన్నారు. 12.75 లక్షల మంది విద్యార్థులు ఈ విషయంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనౌవుతున్నారన్నారు. ఆ ప్రభావం పరీక్షలపై పడి ఉన్నత విద్యకు దూరం అవుతున్న సం దర్భాలు కూడా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలన్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యాహక్కు చట్టం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమ ంలో విద్యార్థులు నరేశ్. మోహన్, సాయి వెంకట్, వేణు, మోక్షిత్, గోపి, రాజేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608